

సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

## ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

దేవరుప్పుల, మే 29: ఉపాధిహామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. దీనికి అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్ హాజరై మండలంలో గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధిహామీ పనులు, సామాజిక తనిఖీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 34 గ్రామపంచాయతీలుండగా, గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించారు. ప్రజావేదిక రాత్రి 10 గంటలకు వరకు జరిగిందని ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. పూర్తి వివరాలు గురువారం తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు ఎస్ఆర్‌పీ గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, అంబుడ్స్‌మెన్ అధికారి రాజు, సంధ్య, ఏపీవో శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలి

### రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రఘునాథపల్లి మే 29 :జనగామ జిల్లాకు వీరనారి చాకలి ఐల్లమ్మ పేరు పెట్టాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జనగామ ప్రాంతం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పుట్టినిల్లు అన్నారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా చాకలి ఐల్లమ్మ సాయుధ పోరాటం నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. జమిందార్ రాపాక రామచంద్రారెడ్డికి ఎదురొడ్డి నిలిచిన వీరనారి ఐలమ్మ అన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పీడిత ప్రజలను ఏకం చేశారని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా శ్రామిక వర్గ ప్రయోజనం కోసం తన జీవితాన్ని ఐలమ్మ ధారబోశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ త్యాగాన్ని పరిశీలించి జనగామ జిల్లాకు ఆమె పేరు పెట్టాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో ఎలిమిలేట్ ఐలయ్య, మైలారం శ్రీనివాసు, భిక్షపతి, తడకపెల్లి రామ్మూర్తి, సంపత్, వెంకట్ నర్సు, చంద్రయ్య, సత్యనారాయణ, లోకేశ్ పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం

చిల్పూరు, మే 29 : రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియ శ్రీహరి, కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో దేవాదుల ప్రాజెక్టు పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకారకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించి పనుల పూర్తికి హామీ ఇచ్చారని ఆయన వివరించారు.



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## జూన్ 3 నుంచి 'బడిబాట'

### మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ

జనగామ చౌరస్తా, మే 29 : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు వచ్చే నెల 3 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో 'బడిబాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయని ఆయన పేర్కొన్నారు. బడిబాటపై ఈ నెల 30న జిల్లాస్థాయి, 31న మండల స్థాయి, జూన్ 1న గ్రామస్థాయిలో సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు వాటి బలోపేతానికి మరింత కృషి చేస్తామని రాము తెలిపారు. బడిబాటతో విద్యార్థులకు ఉచిత ఆంగ్ల మాధ్యమంలో బోధన, పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్నారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన విద్యా బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా రాము వివరించారు.

# ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం తగదు

- కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలి
- సివిల్ సప్లయ్ అధికారులకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషా ఆదేశం

రఘునాథపల్లి, మే 29: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మండలంలోని వెల్ది, అశ్వరావుపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆరబోసిన ధాన్యాన్ని షేక్‌రిజ్వాన్‌బాషా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో తరలించాలని అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. వర్షకాలం సమీపిస్తున్నందున కల్లాల్లోని ధాన్యం తడిసే పరిస్థితి నెలకొందన్నారు. రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి న అనంతరం వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ మార్కెటింగ్ డీఎం రోజారాణి, డీఆర్‌డీఏ మొగులప్ప, తహసీల్దార్ యు గేందర్, ఐకేపీ ఏపీఎం సారయ్య, సీసీ సంపత్ పాల్గొన్నారు.



అశ్వరావుపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌పాషా



జనగామలోని ఉర్దూ మీడియం పాఠశాలలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

### అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

జనగామ చౌరస్తా : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్తీ ఎంపీయూపీఎస్, ఉర్దూ మీడియం స్కూల్, బాణాపురం, ఎల్లంల ఎంపీపీఎస్, శామీర్‌పేట జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, స్విచ్ బోర్డులు, పాఠశాల ఆవరణలో తాగునీటి సంపులు, వాష్ ఏరియా ప్లాట్‌ఫాం, నీటి కుళాయిలు, టాయిలెట్స్‌ను నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. జిల్లాలోని 291 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో ఇప్పటి వరకు 93 పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగతా పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాము , తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**రైతులతో అవగాహన సదస్సులో డీఏవో వినోద్**

బచ్చన్నపేట మే 29: విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని విత్తన విక్రయ షాపులను ఆయన బుధవారం సందర్శించారు. నిల్వ ఉంచిన విత్తనాలను పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినోద్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో నాణ్యమైన వాటిని మాత్రమే తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన రశీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. లూజు విత్తనాలను విక్రయించరాదని, జీఈఏసీ అనుమతి ఉన్న పత్తి విత్తన ప్యాకెట్స్ మాత్రమే విక్రయించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



బచ్చన్నపేటలోని విత్తనాల షాపులో డీఏవో వినోద్

### దేవరుప్పలలో ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

దేవరుప్పుల : నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని పాలకుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు పరశురాంనాయక్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పరశురాంనాయక్ ఫర్టిలైజర్ షాపుల యజమానులతో మాట్లాడారు. గడువు ముగిసిన విత్తనాలు, పురుగు మందులు విక్రయించొద్దన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. రసీదుపై విత్తన కంపెనీ పేరు, నంబర్ వేయాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎక్కువ ధరలకు అమ్మడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాగర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జనగామ చౌరస్తా, మే 29 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. 4వ రోజు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగం గణితం-1 బీ, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షకు 1239 మంది, ఒకేషనల్‌కు 282 మంది కలిపి మొత్తం 1521 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఐఈవో) కే ఆంజనేయరాజు తెలిపారు. జనరల్, ఒకేషనల్ కలిపి 30 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన సెకండ్ ఇయర్ జనరల్ విభాగంలో గణితం-2 బీ, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షకు 427 మంది, ఒకేషనల్ పరీక్షకు 84 మంది కలిపి మొత్తం 511 మంది విద్యార్థులు హాజరయ్యారు. 21 మంది జనరల్, ఒకేషనల్ విభాగం విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు ఆంజనేయరాజు విలేకరులతో వెల్లడించారు.

## ఘనంగా టీపీటీఎఫ్ దశాబ్ది ఉత్సవాలు

జనగామ చౌరస్తా, మే 29 : తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్)దశాబ్ది ఉత్సవాలు బుధవారం జిల్లా కేంద్రంలోని ఉమాపతి భవన్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఏ నర్సింహారెడ్డి, విశిష్ట అతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ హాజరై సంస్థ జెండాను ఎగురవేశారు. అనంతరం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బందారపు లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడారు. 1944 నుంచి ఏపీటీఎఫ్‌గా విద్యారంగంలో అందించిన సేవలు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం టీపీటీఎఫ్‌గా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నట్లు ఆయన వివరించారు. సంఘటిత ఉద్యమాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు, నూతన ఉపాధ్యాయ నియమాకాలను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డీ నర్సింహారెడ్డి, టీ రామచంద్రం, సీహెచ్ రవీందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు వై వజ్రయ్య, బీ వెంకన్న, సత్యనారాయణరెడ్డి, అంకుషావలి, జే రాజేందర్, మండల బాధ్యులు ఏ రాజారెడ్డి, వరప్రసాద్, వసంత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నిర్వహించిన ఉత్సవాల్లో సంస్థ బాధ్యులు





మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత

## బాల సదన్‌ను పరిశీలించిన జడ్జి

జనగామ చౌరస్తా, మే 29 : జిల్లా కేంద్రంలోని బాలసదన్ (చిల్డ్రన్స్ హోమ్)ను బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత తనిఖీ చేశారు. బాలసదన్‌లో పిల్లలకు అందిస్తున్న విద్య, వైద్యంతో పాటు మౌలిక వసతుల గురించి చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా ప్రతిరోజు నాణ్యమైన ఆహారంతో పాటు సురక్షితమైన తాగునీరు అందించాలని కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి చదువు ఒక్కటే మార్గమని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఇట్టబోయిన జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వేణుగోపాలస్వామి తిరుకల్యాణం

రఘునాథపల్లి, మే 29: మండలంలోని కోమల్లలో గురువారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి తిరుకల్యాణం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం మధ్యాహ్నం జరిగే కల్యాణోత్సవానికి భక్తులు తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రతిభ

బచ్చన్నపేట , మే 29: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జాతీయస్థాయిలో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్యనారాయణ ప్రతిభ చూపారు. 3 వేలు, 5 వేల మీటర్ల రన్నింగ్ పోటీల్లో మండలంలోని కట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సూర్యనారాయణ పాల్గొన్నారు. ప్రతిభతో ద్వితీయ స్థానంలో నిలిచారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పృథ్వీరాజ్ తెలిపా రు. ఈసందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యనారాయణను అభినందించి సత్కరించారు.



పల్లె గౌతమి



శ్రావ్య



నక్క రోహిత్



గాదె శ్రీజ



కాసర్ల రీతిక



శ్రీవర్షిత

## మెరిట్ స్కాలర్‌షిప్పులకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

జఫర్‌గఢ్, మే 29 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్స్(ఎస్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను మండల నోడల్ అధికారి ఎండీ ఫర్వేజ్ బుధవారం విలేకరులకు తెలిపారు. కూనూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన పల్లె గౌతమి, పసునూరి శ్రావ్య, తమ్మడపల్లి(జీ)కి చెందిన నక్క రోహిత్, గాదె శ్రీజ, మోడల్ స్కూల్‌కు చెందిన కాసర్ల రీతిక, మామిడాల శ్రీవర్షిత ఎస్ఎంఎంఎస్ స్కాలర్ షిప్స్‌కు ఎంపికయ్యారని ఆయన వివరించారు. ఆయా పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత డిసెంబర్‌లో జరిగిన ఎస్ఎంఎంఎస్ ఎంపిక పరీక్షలు రాసి స్కాలర్ షిప్స్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి ప్రతి యేడాది రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు స్కాలర్ షిప్ అందుకోనున్నట్లు ఫర్వేజ్ తెలిపారు. ఆరుగురు విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఆయనతోపాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో సాగర్

## విత్తన కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

దేవరుప్పుల, మే 29: వానకాలం పంటల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకుని, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని దేవరుప్పుల క్లస్టర్ ఏఈవో సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడారు. పత్తి విత్తనాల విషయంలో మోసపోవద్దని, ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాల ప్యాకెట్లు కొనుగోలు చేసి రసీదులు పొందాలన్నారు. గడువు మీరిన విత్తనాలు కొనొద్దని, లాట్ నంబర్ కంపెనీ పేరు, రసీదుపై ఉండేలా చూడాలని ఆయన సూచించారు. నాణ్యమైన విత్తనాలతోనే పంటల దిగుబడి బాగుంటుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం పంటలు సాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

## భార్య మృతికి కారణమైన భర్తకు రిమాండ్

పాలకుర్తి రూరల్, మే 29 : భార్యను విద్యుత్ షాక్‌తో హతమార్చిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సింగపురం తండా జీపీకి చెందిన గుగులోత్ స్వాతి(23) గర్భిణి. గత ఫిబ్రవరి 23వ తేదీన ఉదయం స్నానం చేసి బట్టలను ఇంటి పక్కన గల భూక్యా యాకూబ్ ఇంటి రేకులపై అరేయగా కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త గుగులోత్ రాకేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే స్వాతి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందలేదని వెల్లడైంది. తన ఇంటి పక్కన గల భూక్యా యాకూబ్‌తో పలు మార్లు స్వాతి కుటుంబం బట్టలు అరవేసే విషయంలో గొడవ పడింది. దీంతో యాకూబ్ ఉద్దేశపూర్వకంగానే తన ఇంటి రేకులకు విద్యుత్ ప్రసరించేలా చేశాడని పోలీసుల విచారణలో తేలింది. యాకూబ్ నేరాన్ని అంగీకరించి స్వాతి మృతికి తానే కారణమని విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. దీంతో యాకూబ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనలో కేసు దర్యాప్తు చేసిన ఎస్సై ఎం లింగారెడ్డి, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.

NTW-318953

**WANTED**

jobs Apply Now!

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.

NT-339514

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565


## నేడు, రేపు సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

జఫర్‌గఢ్, మే 29 : సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను ఈ నెల 30, 31 తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. గురువారం ప్రారంభమయ్యే శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర నాయకుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు హాజరుకానున్నట్లు రమేష్ తెలిపారు. శుక్రవారం జరిగే శిబిరాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని ఆయన వివరించారు. జిల్లాలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రమేశ్ కోరారు. ఈ సమావేశంలో సమ్మయ్య, జాఫర్, మల్లయ్య పాల్గొన్నారు.

## బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

జఫర్‌గఢ్, మే 29 : లోక్‌సభ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసినందున ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు యూయస్పీసీ, జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చర్చలు జరిపారన్నారు. ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపినా నేటికీ ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ పంపక పోవడం విచారకరమని జయ ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేసారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు ఏర్పడిన న్యాయపరమైన ఆటంకాలు తొలిగినందున ఈ యేడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పదోన్నతులు ప్రక్రియ చేపట్టాలని కోరారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, మే 29 : కాజీపేట రైల్వే స్టేషన్ శివారులోని అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలోని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, 5'7 ఎత్తు, వైట్ జీన్స్, తెలుపు రంగు గీతల పుల్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమ చేతిపై HH అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామన్నారు. సంబంధికులుంటే కాజీపేట జీఆర్పీ లేదా 87126 58609లో సంప్రదించాలని కోరారు.

# సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

- లోక్‌సభ ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి
- సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, మే 29 : నిజాయితీగా విధులు నిర్వర్తించి బాధితులకు న్యాయం చేయాలని, పోలీసు ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను హెచ్చరించారు. బుధవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 4న ఎనుమాముల మార్కెట్‌లో నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల కౌటింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలపై నిఘా పెట్టి, విక్రయించే వ్యక్తులపై కఠినంగా వ్యవరించాలన్నారు. ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నా రు. శాంతిభద్రల విషయంలో ప్రజలు స్థానిక పోలీసులకు ఫిర్యా దు చేయాలని, స్పదించకుంటే 871268 070 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సాఫీగా నిర్వహించడానికి కృషి చేసిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో డీసీపీలు అబ్దుల్ బారి, రవీందర్, ఏఎస్పీ అంకిత్ పాల్గొన్నారు.





పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

## 'అనుమతిలేని పాఠశాలల వివరాలు వెల్లడించాలి'

జనగామ చౌరస్తా, మే 29 : జిల్లాలో ప్రభుత్వ అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలల వివరాలను సంబంధిత అధికారులు వెంటనే వెల్లడించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరారు. ప్రతి పాఠశాల నోటీసు బోర్డులో ఫీజుల వివరాలను తరగతుల వారీగా వెల్లడించాలని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నాయని ఆయన తెలిపారు. ట్యూషన్ ఫీజు మొత్తం ఒకేసారి చెల్లించాలని తల్లిదండ్రులకు మెసేజ్ పెడుతూ ఇబ్బంది పెడుతున్నాయని పేర్కొన్నారు. ఇలాం టి పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సీబీఎస్ఈ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు రూ.5 వేలకు పైగా వ సూలు చేస్తున్నారని తెలిపారు. ఈ-టెక్నో, ఐఐటీ, ఇంటర్నేషనల్, డీజీ అనే ప్రత్యేక పేర్లుపెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చే స్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దోసగాని సుమ, సహాయ కార్యదర్శి విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే వృద్ధురాలి బంగారు గొలుసు చోరీ..

- పాలకుర్తిలో ఘటన
- పోలీసుల దర్యాప్తు

పాలకుర్తి రూరల్, మే 29: గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు చిట్యాల లింగమ్మ బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు నిద్రపోతున్నది. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు లింగమ్మ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ క్రమంలో గొలుసులోని కొంత బంగారం కింద పడిపోగా సుమారు రెండున్నర తులాల ఆభరణం చోరీకి గురైంది. లింగమ్మ కేకలు వేయడంతో దుండగులు బైక్‌పై పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ గట్ల మహేందర్‌రెడ్డి

**వరుస ఘటనలతో స్థానికుల ఆందోళన**

పాలకుర్తి మండలం గూడూరులో గత 18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటనను మరిచిపోకముం దే బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలో వృద్ధురాలి మెడలో నుంచి రెండున్నర తులాల బంగారం దొంగిలించారు. చైన్‌స్నాచర్లతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుండగులను గుర్తించి చట్ట ప్రకారం శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని పలువురు పోలీసు అధికారులను కోరారు.